సాక్షి నిజామాబాద్

శనివారం ౹ 20 ౹ జనవరి ౹ 2024



లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా కృషి చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ సూచించారు.

- 8లో ▸



అవినీతిమయం..

మాక్లూర్ సొసైటీ అవినీతిమయంగా మారింది. అధికారుల విచారణలో రూ.కోటి దుర్వినియోగమైనట్లు తేలడం చర్చనీయాశంమైంది.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.6 /20.0

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

డీసీవో సింహాచలం బదిలీ

- కొత్త డీసీవోగా శ్రీనివాస్ బాధ్యతలు



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా సహకార శాఖ అధికారి(డీసీవో) సింహాచలం బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయనను రాష్ట్ర శాఖకు బదిలీ చేస్తూ రాష్ట్ర సహకార శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. డీసీవోగా సింహాచలం జిల్లాలో దాదాపు ఆరేళ్ల పాటు పనిచేశారు. నూతన డీసీవోగా యాదాద్రి భువనగిరి జిల్లాలో డీసీవోగా పనిచేస్తున్న శ్రీనివాస్ జిల్లాకు వచ్చారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును మర్యాదపూర్వకంగా కలిశారు.

ముగిసిన రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన



నిజామాబాద్‌అర్బన్: జిల్లాస్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన శుక్రవారం ముగిసింది. రెండు రోజులపాటు ఆన్‌లైన్‌లో ప్రదర్శన నిర్వహించారు. జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలలు 250 ప్రదర్శనల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో ఇలా ప్రదర్శన నిర్వహించడం మొదటిసారిగా జరిగింది. ఇందులో ఎంపిక చేసిన ప్రదర్శనలను రాష్ట్రస్థాయి ప్రదర్శనకు పంపనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 23, 24 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని డీఈవో తెలిపారు.

రామ పాదుకలు మోయడం పూర్వజన్మ సుకృతం

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



సుభాష్‌నగర్: అయోధ్యలో రాములవారి పాదుకలను మోయడం తన పూర్వజన్మ సుకృతమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. అయోధ్యలోని శ్రీరాముడి పాదుకలను చిలుకూరి శివాలయం అర్చకులు సురేష్ ఆత్మారాం, 22 మంది రామభక్తుల బృందం కొండగట్టుకు పాదయాత్ర తీసుకెళ్తుండగా.. శుక్రవారం నిజామాబాద్ నగరానికి చేరుకున్నారు. వీరికి వేదాంతి శ్రీనివాస్ శర్మతో కలిసి ధన్‌పాల్ స్వాగతం పలికారు. రాములవారి పాదుకలను తలపై పెట్టుకుని పాదయాత్ర చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదుకలను తాకడం సాక్షాత్తూ ఆ రాముల వారి పాదాలను స్పర్శించిన అనుభూతి కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ ఇల్లెందుల మమతా ప్రభాకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు కొత్త పసుపు


- క్వింటాలుకు రూ. 10,251 పలికిన ధర



సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి శుక్రవారం కొత్త పసుపు వచ్చింది. బాల్కొండ మండలం బోదేపల్లికి చెందిన రైతు దాసరి ప్రవీణ్, ఏర్గట్లకు చెందిన బద్దం కెన్నడీ సుమారు 30 క్వింటాళ్ల పసుపును మార్కెట్‌కు తీసుకొచ్చారు. కొత్త పసుపు రావడంతో సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం, గ్రేడ్–2 సెక్రెటరీ విజయ్‌కిషోర్ పరిశీలించారు. తొలిరోజే క్వింటాలుకు రూ. 10,251 ధర పలికింది. ఈసందర్భంగా సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వెంకటేశం మాట్లాడుతూ రైతులు తొందరపడి మార్కెట్‌కు పచ్చి పసుపు తీసుకురావొద్దని, ఎండబెట్టిన తర్వాతే తీసుకురావాలని సూచించారు. తేమశాతం 12గా ఉన్న పసుపు తీసుకొస్తే మంచి ధర వస్తుందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా మార్కెట్ కమిటీ చర్యలు చేపడుతుందన్నారు.

వీడని నిస్తేజం!

త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్‌లు వ్యూహరచనతో ముందుకు వెళ్తుండగా.. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్‌లో మాత్రం ఇంకా స్తబ్ధత వీడలేదు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి సైతం తన ఓటమి తర్వాత ఒకేసారి నియోజకవర్గానికి రాగా, ఆ తర్వాత జిల్లావైపు తిరిగి చూడలేదు.



- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలోనూ బీఆర్‌ఎస్‌లో స్తబ్ధత
- మరోవైపు గేర్ మార్చి స్పీడ్ పెంచిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు
- పార్టీ జిల్లా అధ్యక్షుడిని మార్చే యోచనలో గులాబీ నాయకత్వం!

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : పదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారం చెలాయించిన బీఆర్‌ఎస్ పార్టీలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత ఒక్కసారిగా నిస్తేజం అలుముకుంది. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల పోరుకు తగిన విధంగా సన్నద్ధమయ్యే విషయంలోనూ గులాబీ శ్రేణుల్లో స్తబ్ధత వీడలేదు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ప్రధాన జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌లు గేర్ మార్చి స్పీడ్ పెంచి ముందుకు వెళ్తున్నాయి. రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో పకడ్బందీగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి స్పీడ్ పెంచారు. బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డిలు పాల్గొనే కార్యక్రమాల్లో మానాల పాల్గొంటూనే మిగిలిన నియోజకవర్గాల్లో సైతం వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. లోక్‌సభ సీటును దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సోషల్ ఇంజినీరింగ్ చేసుకుంటూ పకడ్బందీగా పావులు కదుపుతోంది. కాంగ్రెస్ జిల్లా పార్టీ రెట్టించిన ఉత్సాహంతో కదులుతోంది. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సైతం తన సిట్టింగ్ ఎంపీ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు గాను పక్కాగా వ్యూహరచన చేస్తోంది. ఇందులో భాగంగా ప్రతి చిన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. తాజాగా పార్టీ జిల్లా అధ్యక్షుడిని సైతం మార్పు చేసుకుని ముందుకు వెళుతోంది. జిల్లా అధ్యక్ష పీఠంపై బస్వా లక్ష్మీనర్సయ్య స్థానంలో కులాచారి దినేశ్‌ను పార్టీ నాయకత్వం నియమించింది. ఈ మేరకు గురువారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కులాచారి దినేశ్ సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు సన్నిహితుడు. దినేశ్ ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో నిజామాబాద్ రూరల్ నుంచి 50 వేల మేర ఓట్లు సాధించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎంపీ అర్వింద్ పావులు వేగంగా కదుపుతున్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా, రెండు పార్టీలు పోటాపోటీగా ఉన్నాయి. బీఆర్‌ఎస్ మాత్రం కార్యాచరణ షురూ చేయలేదు.

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో జీవన్‌రెడ్డి వ్యవహారశైలిపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శలు చేయడం గమనార్హం. కేటీఆర్ సైతం జిల్లా అధ్యక్షుడి మార్పు చేయనున్నట్లు ఇప్పటికే సంకేతాలు ఇవ్వడం విశేషం. దీన్ని బట్టి త్వరలో జీవన్‌రెడ్డిని అధ్యక్ష పీఠం నుంచి తప్పించనున్నట్లు పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.

జాడలేని జీవన్‌రెడ్డి!



బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడిగా పదవిలో ఉన్న ఏడాదిన్నర కాలంలో ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లోని ఏ ఒక్క మండలంలోనూ పర్యటించలేదు. పైగా అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్మూర్ నుంచి పోటీ చేసిన జీవన్‌రెడ్డి కేవలం 39 వేల ఓట్లు సాధించారు. మూడో స్థానంలో నిలిచి దారుణ పరాజయం మూటగట్టుకున్నాడు. ఆర్మూర్‌లో ఓటమి తరువాత కేవలం ఒక్కసారి మాత్రమే జీవన్‌రెడ్డి నియోజకవర్గానికి వచ్చాడు. మళ్లీ జిల్లావైపు తిరిగి చూడలేదు. జీవన్‌రెడ్డి అడ్రస్ లేకుండా పోయినట్లు నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తలూ బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. జీవన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మంత్రిని సైతం ఆర్మూర్ నియోజకవర్గంలోకి రానివ్వలేదు. దీంతో జీవన్‌రెడ్డిని ఇప్పుడు ఇతర నియోజకవర్గాల్లో అక్కడి నాయకులు తిరగని వ్వని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఆర్మూర్ నియోజకవర్గానికి సైతం జీవన్‌రెడ్డి రావడం లేదు.

ఆర్మూర్ చైర్‌పర్సన్ ఎన్నికెప్పుడు?



ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయానికి తరలివచ్చిన కౌన్సిలర్లు, నాయకులు

- అవిశ్వాస తీర్మానం నెగ్గి 15 రోజులు
- నూతన చైర్‌పర్సన్ ఎన్నికకు ఉత్తర్వులు జారీచేయని అధికారులు
- న్యాయ సమస్యలా.. అధికార పార్టీ జిమ్మిక్కా..!

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికపై ఉత్తర్వులు వెలువడకపోవడంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు చైర్‌పర్సన్ పండిత్ వినీతపై తిరుగుబాటు చేసి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గి 15 రోజులు గడుస్తోంది. అయినా నేటికీ వైస్‌చైర్మన్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించకపోవడం, చైర్ పర్సన్ ఎన్నికకు ఉత్తర్వులు వెలువడకపోవడంతో ఆలస్యానికి గల కారణాలపై చర్చ జరుగుతోంది. 1965 చట్టంలో పాలకమండలి ఎన్నిక నుంచి నాలుగేళ్ల వరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టకూడదనే నిబంధన ఉండేది. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2019లో మున్సిపల్ యాక్టును సవరించి అవిశ్వాస తీర్మానం గడువును మూడేళ్లకు కుదించారు. అయితే ఈ చట్టంలో పాలకమండలి రద్దయితే కొత్త బాడీని ఎలా ఎన్నిక చేయాలనే ప్రక్రియపై రూల్స్ తయారు చేయలేదని తెలుస్తోంది. దీంతో మున్సిపల్ అధికారులు 2019 చట్టం మేరకు కొత్త రూల్స్ తయారు చేయాలా.. లేక 1965 చట్టంలో ఉన్న ప్రకారం ఎన్నిక ప్రక్రియను కొనసాగించాలా అనే న్యాయపరమైన సందిగ్ధత నెలకొనడంతో ఆలస్యం జరుగుతున్నట్లు చర్చ జరుగుతోంది. మరోవైపు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీని ఓడించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తమ ఖాతాలో ఆయా మున్సిపాలిటీలను వేసుకోవడం కోసం చైర్‌పర్సన్ల ఎన్నికలను రాష్ట్రవ్యాప్తంగా నిలిపివేసినట్లు చర్చ నడుస్తోంది. దీంతో క్యాంపు రాజకీయాలు చేస్తున్న ఆశావహుల ఖర్చు రోజు రోజుకీ పెరిగిపోవడంతో పాటు కౌన్సిలర్లను బుజ్జగిస్తూ వారి డిమాండ్లు తీర్చడం కోసం ఇక్కట్లు పడుతున్నారు.

ఆర్డీవోను కలిసి విన్నవించిన తిరుగుబాటు కౌన్సిలర్లు

ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలకు చెందిన పలువురు కౌన్సిలర్లు, ఆయా పార్టీల నాయకులు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో వినోద్ కుమార్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వీలైనంత త్వరగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు ఉత్తర్వులు జారీ చేయాలని.. అప్పటి వరకు వైస్‌చైర్మన్ షేక్ మున్నుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఆర్డీవో స్పందిస్తూ ఈ అంశం తన పరిధిలో లేదని అవిశ్వాస తీర్మానం నెగ్గిన నివేదికను కలెక్టర్‌కు సమర్పించానని పేర్కొన్నారు. ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించిన వారిలో వైస్ చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్లు, నాయకులు బండారి ప్రసాద్, రంగన్న తదితరులున్నారు.

త్వరలో సీఐల బదిలీలు!

- ఈ నెల 31 వరకు జరిగే అవకాశం
- ఎంపీ ఎన్నికల నేపథ్యంలో..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీఐల బదిలీలకు రంగం సిద్ధమైంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో రెండున్నరేళ్ల నుంచి మూడేళ్లుగా పనిచేస్తున్న సీఐలను బదిలీలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి పోలీస్ ఉన్నతాధికారులకు ఉత్తర్వులు వచ్చినట్లు సమాచారం. దీంతో జిల్లాలో పనిచేస్తున్న సీఐల సీనియారిటీ జాబితా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ వద్దకు చేరినట్లు తెలిసింది. సీఐలకు సంబంధించిన జాబితాను తయారు చేయించి ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం. ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జగిత్యాల జిల్లాలో సీఐల బదిలీలు జరిగాయి.



ఇటీవలే జిల్లాకు కొందరు..

జిల్లాలోని సీఐల బదిలీలు ఈనెల 31 వరకు జరిగే అవకాశాలు ఉన్నట్లు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. శాసనసభ ఎన్నికలు పూర్తయిన తర్వాత బదిలీలు జరుగుతాయనే చర్చ జరిగింది. కానీ నెల రోజులవుతున్నా ట్రాన్స్‌ఫర్స్ కాలేదు. దీంతో ఎంపీ ఎన్నికల నేపథ్యంలో కచ్చితంగా బదిలీలు జరుగుతాయని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తమకు అనుకూలంగా ఉండే స్థానాల్లో పోస్టింగ్‌ల కోసం సీఐలు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ జిల్లాలో ఇటీవలే కొంత మంది సీఐలు బదిలీపై రావడంతో.. కొందరికే బదిలీలు జరుగుతాయనే చర్చ జరుగుతోంది. సీఐల బదిలీలకు సంబంధించిన ఫీడ్ బ్యాక్‌ను పోలీసు అధికారులు తీసుకున్నట్లు తెలిసింది. జిల్లాలో పనిచేయడానికి విల్లింగ్ ఉన్నారా లేదా అని పోలీసు అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. అయితే ఈ నెల 31 వరకు బదిలీలు జరుగుతాయనే చర్చ కొనసాగుతోంది.

జిల్లాలో ముగ్గురు సీఐలకు..!

జిల్లాలో ముగ్గురు సీఐలు బదిలీ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇద్దరు సీఐల పదవీకాలం మూడేళ్లు పూర్తి కాగా మరొకరు సీఐగా చేయడానికి ఆసక్తిగా లేరనే ప్రచారం జరుగుతుంది. వీరు కాకుండా మరో ఇద్దరు లేదా ముగ్గురు సీఐల బదిలీలు ఉంటాయని తెలుస్తోంది.

జెడ్పీ సమావేశం.. నామమాత్రం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



కింద కూర్చుని నిరసన తెలుపుతున్న జెడ్పీటీసీ గంగాధర్

నిజామాబాద్ రూరల్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నామమాత్రంగా సాగింది. ప్రజా సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించకుండా తూతూ మంత్రంగా నిర్వహించారు. 2024 –25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కేటాయింపుల విషయమై జరిగిన సమావేశంలో చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 15, 16వ ఆర్థిక సంఘం నిధులతో పాటు కేంద్రం నుంచి వివిధ గ్రాంట్ల రూపంలో సమకూరే నిధులు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందనున్న నిధులపై జెడ్పీ సీఈవో గోవింద్ సభ్యులకు వివరించారు. ఈ నిధులతో చేపట్టాల్సిన పనుల వివరాలను తెలియజేశారు. నిబంధనలకు అనుగుణంగా గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌కు నిర్ణీత నిష్పత్తిలో నిధులు కేటాయించబడతాయన్నారు. ఈ సందర్భంగా నిధుల కేటాయింపుపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ, అన్ని ప్రాంతాలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని తీర్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు, కో–ఆప్షన్ మెంబర్లు, జెడ్పీ అధికారులు పాల్గొన్నారు.

- ప్రజా సమస్యలపై చర్చకు అంతగా ప్రాధాన్యం ఇవ్వని వైనం
- బడ్జెట్ కేటాయింపులపై ఏకాభిప్రాయం

పలు సమస్యలపై..

సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. చందూర్ జెడ్పీటీసీ అంబర్‌సింగ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో గిరిపుత్రులకు ఇచ్చిన పోడు భూములకు క్రాప్‌లోన్ ఇవ్వడంలేదని, ఎస్టీ కార్పొరేషన్ కింద కూడా లోన్‌లు మంజూరు కావడం లేదని అధికారులను ప్రశ్నించారు. జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ స్పందిస్తూ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఇందల్వాయి జెడ్పీటీసీ సుమనారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని దృష్టికి తెచ్చారు. వ్యవసాయాధికారి స్పందిస్తూ ఎక్కడా యూరియా కొరత లేదని పేర్కొన్నారు. మెండోరా జెడ్పీటీసీ గంగాధర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ప్రొసీడింగ్స్ అలాగే ఉండిపోయాయని, అదేవిధంగా చేపట్టిన పనులకు డబ్బులు మంజూరు కావడం లేదని నిరసన తెలిపారు. ఆయన మద్దతుగా జెడ్పీటీసీలందరూ లేచి తీర్మానం చేసి సీఎం రేవంత్‌రెడ్డికి పంపాలని.. లేదంటే సభ నుంచి బయటకు వెళ్లిపోతామని అనడంతో జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ తీర్మానం చేసి పంపుతామని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఎలక్షన్ కోడ్ కంటే రెండు రోజుల ముందు ఇచ్చిన ప్రొసీడింగ్ కాపీలను హోల్డ్‌లో ఉంచారని సంబంధిత అధికారి తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమరాజ్‌పై ఆరోపణలు ఉన్నాయని చందూర్ జెడ్పీటీసీ అంబర్‌సింగ్, మోర్తాడ్ జెడ్పీటీసీ శివలింగరాజులు చైర్మన్ దృష్టి తీసుకురాగా.. జీజీహెచ్‌లో సమస్యలను కలెక్టర్‌కు నివేదిస్తామని జెడ్పీ చైర్మన్ వివరించారు.

రంగంలోకి నార్కొటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్!

కొత్తపుంతలు తొక్కుతున్న మత్తు పదార్థాల దందాపై ఎట్టకేలకు పోలీసు యంత్రాంగం స్పందించింది. ద్రవరూపంలో లభిస్తున్న గంజాయి ఎక్కడినుంచి వస్తుందన్న విషయమై నార్కొటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ దందాలో సూత్రధారులు ఎవరు అన్న వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం.

- ద్రవరూప గంజాయి లింక్‌పై ఫోకస్
- ఎక్కడి నుంచి వస్తుందన్న దానిపై ఆరా
- పూర్తి వివరాలు సేకరిస్తున్న అధికారులు

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి పట్టణానికి సమీపంలో దేవునిపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో కొందరు యువకులు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో ఇటీవల పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో గంజాయి బాటిళ్లను విక్రయించిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి కోసం వచ్చిన మిగతా ఐదుగురిని స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు. ఐదుగురు యువకులు గంజాయి తీసుకున్నారా? లేదా అన్నది తేల్చేందుకు శాంపిళ్లను తీసుకుని ల్యాబొరేటరీకి పంపించారు.

అయితే గంజాయి ఎక్కడి నుంచి తెచ్చారు? అసలు సూత్రధారులెవరన్న దానిపై పోలీసులు లోతుగా దర్యాప్తు జరపకపోవడం విమర్శలకు తావిచ్చింది. దీనిపై శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'అసలు సూత్రధారులెవరు?' అన్న కథనంపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. నార్కొటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు సైతం ఈ విషయంపై దృష్టి సారించారు. ద్రవరూపంలోకి మార్చి బాటిళ్లలో నింపిన గంజాయిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారన్న దానిపై ఆరా తీస్తున్నారు. పోలీసులు అరెస్టు చేసిన ఇద్దరు వ్యక్తుల వద్దనుంచి 39 బాటిళ్లను సీజ్ చేశారు. వంద బాటిళ్లలో మిగతా బాటిళ్లు ఎక్కడెక్కడ, ఎవరెవరికి అమ్మారన్న దానిపై వివరాలు సేకరిస్తున్నారు. వివిధ వర్గాల వారితో మాట్లాడి గంజాయి లింక్‌ను కనిపెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

లింక్ దొరికేనా?

సాధారణంగా ఎండు గంజాయిని కొనుగోలు చేసి చిన్నచిన్న పొట్లాల రూపంలో చేసి అమ్ముతుంటారు. కానీ మత్తు వ్యాపారులు కొత్తగా గంజాయిని ద్రవరూపంలోకి మార్చి చిన్నచిన్న బాటిళ్లలో నింపి అమ్ముతుండడం విస్మయం కలిగిస్తోంది. ఈ లిక్విడ్ గంజాయిని ఎక్కడ తయారు చేస్తున్నారు, ఎలా రవాణా చేస్తున్నారన్న అంశాలపై నార్కొటిక్స్ బృందం వివరాలు సేకరిస్తోందని సమాచారం. ఈ వ్యవహారంలో మరింత లోతుగా దర్యాప్తు జరిగితే పూర్తి వివరాలు వెలుగుచూసే అవకాశాలున్నాయి. అయితే లిక్విడ్ గంజాయి కేసులో ప్రముఖుల పిల్లలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు సరైన దర్యాప్తు చేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో లిక్విడ్ గంజాయి తయారీదారులు, సరఫరా చేస్తున్న ముఠాకు సంబంధించిన లింక్‌ను పోలీసులు ఛేదించగలరా అన్న విషయమై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నార్కొటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మరింత లోతైన దర్యాప్తు చేపడితే ద్రవరూప గంజాయి లింక్ దొరికే అవకాశాలున్నాయి.

యువఓటర్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు

- నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం సందర్భంగా యువఓటర్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా అంశాలపై దిశానిర్దేశం చేశారు. కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. శని, ఆదివారాల్లో నిర్వహించనున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. 18 ఏళ్లు పూర్తి చేసుకున్న యువతీ, యువకులందరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద నిర్ణీత 6, 7, 8 దరఖాస్తుఫారాలతో అధికారులు, బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఓటరు ముసాయిదా జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులుంటే సరి చేసుకునేలా చూడాలన్నారు. జిల్లాలో నివాస ప్రాంతానికి రెండు కిలోమీటర్లకు పైబడి దూరంలో పోలింగ్ కేంద్రాలు ఉంటే, వాటి వివరాలు తెలియజేయాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి యాదిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం మకరందు, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, వినోద్ కుమార్, రాజాగౌడ్, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిమయం మాక్లూర్ సొసైటీ

- రూ. కోటికి పైగా దుర్వినియోగమైన సొమ్ము
- అవసరం లేని చోట్ల గోదాముల నిర్మాణాలు
- ఎవరి హయాంలో వారు రూ. లక్షల్లో దోచుకున్న వైనం



మాక్లూర్ సొసైటీ

మాక్లూర్: జిల్లాలోని మాక్లూర్ సొసైటీ అవినీతి మయంగా మారింది. అధికారుల విచారణలో రూ. కోటికి పైనే నిధులు దుర్వినియోగం కావడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. 2020 నుంచి గోపు లక్ష్మి సొసైటీకి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. కార్యదర్శిగా విష్ణువర్ధన్ ఉన్నారు. రైతుల ఫిర్యాదు మేరకు సొసైటీలో జిల్లా ఉన్నతాధికారులు నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టారు. ఇందులో 2022అక్టోబర్26 నుంచి 2023ఏప్రిల్17 వరకు నిర్వహించిన విచారణలో చైర్‌పర్సన్ లక్ష్మి రూ. 58.87 లక్షల సొమ్ము దుర్వినియోగం చేసినట్లు తేలింది. ఈ విషయమై అంతకు ముందు చైర్మన్‌గా ఉండి ప్రస్తుత పాలకవర్గంలో డైరెక్టర్‌గా ఉన్న దయాకర్‌రావు మరికొందరి డైరెక్టర్లతో కలిసి నిధుల దుర్వినియోగంపై నిలదీశారు. దీంతో నాటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఈ విషయంలో కల్పించుకుని నీ చైర్మన్ హయాంలో అవకతవకలు ఎన్ని జరిగాయో వాటిని ఎంక్వయిరీ చేయించి కాజేసిన సొమ్మును కక్కిస్తానని అతన్ని పరోక్షంగా బెదిరించినట్లు తెలిసింది.

2013 నుంచి 2019 వరకు దయాకర్‌రావు

ప్రస్తుత పాలకవర్గంలో డైరెక్టర్‌గా ఉన్న బి దయాకర్‌రావు 2013 నుంచి 2019 వరకు చైర్మన్‌గా కొనసాగారు. నాటి ప్రభుత్వం పొడిగించిన సంవత్సర కాలాన్ని అంటే 2019 నుంచి 2020 వరకు రమణారావు చైర్మన్‌గా కొనసాగారు. 2020 నుంచి గోపు లక్ష్మి చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఆమె చేసిన అవకతవకలపై మాట్లాడకుండా ఉండేందుకు నాటి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి 2013 నుంచి 2020 వరకు ఎంక్వయిరీ చేయించారు. ఐదేళ్ల పదవికాలంలో దయాకర్‌రావు రూ. 7.94 లక్షలు, సంవత్సర పదవికాలంలో రమణారావు రూ. 13.75 లక్షలు దుర్వినియోగం చేసినట్టు అధికారుల విచారణలో తేలింది. దీంతో వీరు ప్రస్తుత పాలకవర్గం పాల్పడుతున్న అవకతవకలపై మాట్లాడేందుకు వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

తప్పుడు లెక్కలు సృష్టించి

దయాకర్‌రావు, రమణారావును అడ్డం పెట్టుకుని చైర్‌పర్సన్ గోపు లక్ష్మి తన కుమారుడు గోపు రంజిత్‌తో అప్పటి కార్యదర్శి విష్ణువర్ధన్‌ను బెదిరిస్తూ తప్పుడు లెక్కలు సృష్టించి రూ. లక్షల్లో డబ్బులు తీసుకోవటం ప్రారంభించారు. ఈ విషయమై కార్యదర్శి విష్ణువర్ధన్ ఇది సరైన పద్ధతి కాదని రంజిత్‌తో చెప్పినా వినకుండా మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో ఫోన్ చేయిస్తూ చెక్కులు రాయించుకునేవాడు. దీంతో వీరిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో జీవన్ రెడ్డి నాడు చెప్పినట్టు వినడం లేదని కార్యదర్శి విష్ణును తొలగించారు.

2022లో కొత్త కార్యదర్శి..

తమకు అనుకూలంగా ఉండేందుకు 2022 జూన్ నుంచి సంతోష్ అనే వ్యక్తిని కార్యదర్శిగా నియమించుకున్నాడు. నాటి నుంచి సొసైటీలో చైర్‌పర్సన్ కుమారుడు రంజిత్‌ది ఆడిందే ఆట పాడిందే పాటగా నడుస్తోంది. ఈ ఏడాదిన్నర కాలంలో నిర్వహించిన సొసైటీ లావాదేవీలపై ఎంక్వయిరీ చేయిస్తే మరో రూ. 60 లక్షల వరకు దుర్వినియోగమైనట్లు తేలుతుందని సంబంధిత అధికారి ద్వారా తెలిసింది.

అనుమతి లేకున్నా గోదాముల నిర్మాణం

చైర్‌పర్సన్ లక్ష్మి అధికారుల అనుమతి లేకుండా ఢీకంపల్లి, మాణిక్‌బండార్ గ్రామాలలో రూ. 25 లక్షల వ్యయంతో గోదాములను నిర్మించారు. రూ. 5 లక్షలకు పైన జరిగే ప్రతి పనికి డీసీవో అనుమతితో పాటు ఆన్‌లైన్ టెండర్ వేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఎలాంటి టెండర్ లేకుండానే ఏకపక్షంగా వ్యవహరించి అవసరం లేని చోట్ల గోదాములను నిర్మించారనే విమర్శలు ఉన్నాయి. నిధుల దుర్వినియోగం వెనుక బదిలీ అయిన డీసీవో సింహాచలం పాత్ర సైతం ఉన్నట్లు తెలుస్తోంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అవకతవకలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్లుప్తంగా

జాతీయ పోటీలకు ఎంపిక

ఇందల్వాయి: జాతీయస్థాయి కబడ్డీ అండర్–14 పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థిని గౌతమి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీలత శుక్రవారం తెలిపారు. వరంగల్‌లో ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో చక్కని ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపికైనట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థిని శ్రీలతను ఉపాధ్యాయులు అభినందించారు.

డీసీవోకు సన్మానం



సుభాష్‌నగర్: జిల్లా సహకార అధికారి(డీసీవో)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రావును జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో నాగభూషణం వందే, జనరల్ మేనేజర్ సూర్యప్రకాశ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు బదిలీపై వెళ్తున్న డీసీవో సింహాచలంను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

29న ఎస్‌ఎంసీ ఎన్నికలు

నిజామాబాద్‌అర్బన్: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికలను ఈ నెల 29న నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. 29న ఎన్నికలు నిర్వహించి ఎస్‌ఎంసీ సభ్యులు, చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ సహా ఒక్కో తరగతి నుంచి ముగ్గురు ఎన్నికైన తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారని వెల్లడించారు.

జాతీయ అర్చరీ సంఘం ఉపాధ్యక్షుడిగా సంజీవరెడ్డి



డిచ్‌పల్లి: జాతీయ అర్చరీ సంఘం ఉపాధ్యక్షుడిగా తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఈగ సంజీవరెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం ఢిల్లీలోని డీడీఏ యమున స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన జాతీయ అర్చరీ సంఘం ఎన్నికల్లో సంజీవరెడ్డి ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనను సంఘం ప్రతినిధులు శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు.

ఆలయ భూములు కబ్జా చేస్తే చర్యలు



భూములను పరిశీలిస్తున్న సుప్రియ

నిజామాబాద్ సిటీ: ఆలయ భూములను ఎవరైనా కబ్జా చేస్తే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని దేవదాయ, ధర్మదాయ సహాయ కమిషనర్ ఎస్ సుప్రియ హెచ్చరించారు. నగరంలోని బడారాం మందిర్‌కు చెందిన భూములు కబ్జాకు గురికావటంతో శుక్రవారం న్యాల్‌కల్‌రోడ్డులో ఉన్న 28 ఎకరాల 32 గుంటల భూములను మఠం ఫిట్ పర్సన్ వేణు, వివిధ ఆలయాల సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆలయ భూముల పరిశీలనకు వచ్చే దేవాదాయ శాఖ ఉద్యోగులపై కౌలుదారులు, స్థానికులు దౌర్జన్యాలకు దిగుతున్నారని ఇకపై విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి ఇబ్బందులకు గురి చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. అలాగే కబ్జాలో ఉన్న భూములను శాఖకు అప్పగించాలని తెలిపారు. ఆలయ వ్యవసాయ భూములను కౌలుకు తీసుకున్న రైతులు వెంటనే మఠానికి కౌలు డబ్బులు చెల్లించాలన్నారు. జిల్లాలోని బడారాం మఠంకు చెందిన భూమి 213 ఎకరాల 10 గుంటల భూమి ఉందని దానిని త్వరలోనే పూర్తి సర్వే చేయిస్తామని ఆమె పేర్కొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



నిజామాబాద్‌అర్బన్: ఏబీవీపీ ఇందూరు శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన క్రీడా పోటీలను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు రెంజర్ల నరేశ్, సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఇందూరు జిల్లా కన్వీనర్ దామ సునీల్, నగర కార్యదర్శి జగదీశ్, బాలకృష్ణ, ఇంద్రసేన, గోపి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు బడాపహాడ్ ముస్తాబు



బడాపహాడ్ గుట్ట



వర్ని: ఉర్సుకు బడాపహాడ్ ముస్తాబైంది. వర్ని మండలంలోని జలాల్పూర్ శివారులోని అటవీ ప్రాంతంలో ఉన్న షాదుల్లా బాబా దర్గాను దర్శించుకుంటే సకల సౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు, పాడిపంటలు సమృద్ధిగా పండుతాయనేది భక్తుల నమ్మకం. బడాపహాడ్ రామన్న లొంకలో ఉన్న శివాలయంలో భక్తులు మొదట పూజలు నిర్వహించి దర్గాను దర్శించుకుంటారు. హిందూ ముస్లింలు అనే తేడా లేకుండా అనేక ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ప్రతి ఏడాది మూడు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయి.

22 నుంచి ఉర్సు..

ఈనెల 22 నుంచి మూడు రోజులపాటు బడాపహాడ్ ఉర్సు నిర్వహించనున్నట్లు వక్ఫ్ బోర్డు డిప్యూటీ సూపరింటెండెంట్ జమాల్ వెల్లడించారు. 22న మధ్యాహ్నం జలాల్పూర్‌లోని పూజారి ఇంటి నుంచి దేవునికి సమర్పించే గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి షాదుల్లా బాబాకు సమర్పించడంతో ఉర్సు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉత్సవాల కోసం వక్ఫ్ బోర్డు నుంచి రూ. 16 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక కవ్వాలి, దీపారాధన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



స్కూల్ బ్యాగులను పంపిణీ చేస్తున్న ఎంపీ

డొంకేశ్వర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా పయనించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉమ్మడి నందిపేట్ మండలాల ప్రైమరీ విద్యార్థులకు ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్కూల్ బ్యాగులను పంపిణీ కార్యక్రమానికి ఎంపీ హాజరై పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ ప్రతినిధి అవినాశ్ త్రిపాఠి, ఎంఈవో శ్రీనివాస్, సర్పంచ్ చాయ చందు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సిరికొండ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మండలంలోని కొండాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ కోరిక మేరకు గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సర్పంచ్ రమేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, రామస్వామి, రంజిత్‌రెడ్డి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల శుద్ధిలో పాల్గొనాలి

అయోధ్య రామాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ ఆలయాల శుద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన లొంకలో ఉన్న నీలకంఠ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఎంపీ శుద్ధి పనులు చేపట్టారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్పీల డిమాండ్లు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీలు

నిజామాబాద్‌నాగారం: మెప్మా ఆర్పీల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, ఆర్పీలు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్‌గాంధీ, మెప్మా పీడీ రాజేందర్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 2007 నుంచి తాము ఆర్పీలుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆర్పీలకు నెలకు రూ. 20వేల వేతనం, డ్రెస్ కోడ్, రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, కోశాధికారి స్వప్న, ఆర్పీలు జమున, ప్రమీల, సుజాత, హరిత, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం లండన్ పర్యటనలో జిల్లావాసి



లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో సుధాకర్‌గౌడ్

ఖలీల్‌వాడి: సీఎం రేవంత్‌రెడ్డి లండన్ పర్యటనలో ఇండియన్ ఓవర్సీస్ ఉపాధ్యక్షుడు, జిల్లా వాసి సుధాకర్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలంటూ సీఎంతో కలిసి సుధాకర్‌గౌడ్ లండన్‌లోని పార్లమెంట్‌లో పరిశ్రమవేత్తలతో సమావేశం నిర్వహించినట్లు సుధాకర్‌గౌడ్ సోదరుడు దయాకర్‌గౌడ్ లండన్ నుంచి 'సాక్షి'కి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చరవాణిలో మాట్లాడుతూ.. తెలంగాణలో ఎడ్యుకేషన్, పరిశ్రమలలో పెట్టుబడులు పెడితే అన్ని విధాలుగా సహకారం అందిస్తామని సీఎంతో కలిసి సుధాకర్‌గౌడ్ లండన్ పరిశ్రమవేత్తలతో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశం నిర్వహించేలా కృషి చేసినందుకు సుధాకర్‌గౌడ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: గురుకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభ కళాశాల (సీవోఈ)ల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశ పరీక్షకు విద్యార్థులు ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సంస్థ రీజనల్ కో–ఆర్డినేటర్ కె.అలివేలు, జిల్లా కో–ఆర్డినేటర్ బి.సంగీత, సుద్దపల్లి ప్రిన్సిపాల్ గోదావరి శుక్రవారం పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 4న ఉంటుందని, ఆన్‌లైన్‌ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

టీజీసెట్‌కు..

జిల్లాలోని సాంఘిక సంక్షేమ, ఇతర గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశం కోసం ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సంస్థ రీజనల్ కో–ఆర్డినేటర్ కె.అలివేలు, సుద్దపల్లి ప్రిన్సిపాల్ గోదావరి కోరారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ కేటగిరి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రైం కార్నర్

నిందితుడి పట్టివేత

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ ఆలయంలో నిందితుడు ఆలయంలోకి ప్రవేశిస్తుండగా స్థానికులు శుక్రవారం పట్టుకున్నారు. నిందితుడు ఆలయంలోకి ప్రవేశిస్తుండగా చప్పుడు కావడంతో ఆలయం ఎదురుగా ఉండే రుద్ర మధుసూదన్ తన ఇంట్లోని సీసీ కెమెరాను పరిశీలించారు. అందులో ఆలయంలోకి వ్యక్తి ప్రవేశిస్తున్నట్లు కనిపించడంతో వెంటనే స్థానికుల సహాయంతో పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. వారు పీఎస్‌కు తరలించారు. దొంగను పట్టించిన మధుసూదన్‌ను కాలనీవాసులు అభినందించారు.

జీపీ ట్రాక్టర్ నుంచి డీజిల్ చోరీ

నాగిరెడ్డిపేట: మండలంలోని గోపాల్‌పేటకు చెందిన పల్లెప్రగతి ట్రాక్టర్ నుంచి గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్‌ను చోరీ చేశారు. సుమారు 15 లీటర్ల డీజిల్ చోరీకి గురైనట్లు కార్యదర్శి భూమేశ్వర్ తెలిపారు. గతంలో కూడా 40 లీటర్ల డీజిల్‌తో పాటు ట్రాక్టర్‌కు ఉన్న సౌండ్ బాక్సు చోరీకి గురైందన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

రుద్రూర్: కోటగిరి మండలం సుద్దులం తండాలో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్ శుక్రవారం తెలిపారు. వీరి నుంచి రూ.6320 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కారేగాంలో..

రుద్రూర్: పోతంగల్ మండలం కారేగాంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్ శుక్రవారం తెలిపారు. వీరి నుంచి రూ. 2400 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి నాలుగు రోజుల జైలు శిక్షను న్యాయమూర్తి సయ్యద్ ఖదీర్ విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. శుక్రవారం జిల్లా కోర్టులో 5 కేసులకు జడ్జి రూ. 5700 జరిమానా విధించగా ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లికి చెందిన షేక్ అన్వర్‌కు నాలుగు రోజుల జైలు శిక్షను విధించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలను నడపవద్దని సూచించారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

డిచ్‌పల్లి: సౌదీ అరేబియాలో ఈ నెల 2న జరిగిన ప్రమాదంలో గాయపడి మృతి చెందిన డిచ్‌పల్లి మండలం దూస్‌గాం గ్రామానికి చెందిన సురుకుట్ల ప్రవీణ్‌కుమార్ (35) మృతదేహం శుక్రవారం గ్రామానికి చేరుకుంది. కుటుంబీకులు, గ్రామస్తులు కన్నీటి వీడ్కోలుతో అంత్యక్రియలు నిర్వహించారు. సౌదీలోని ఫరూక్ అతడి బృందం సభ్యుల సహకారంతో మృతదేహం త్వరగా ఇంటికి చేరింది. ప్రవీణ్‌కుమార్ మృతదేహానికి ప్రవాస భారతీయుల సంక్షేమ, హక్కుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింహనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆరుగురి బైండోవర్

నందిపేట్: మండలంలోని ఆరుగురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రాహుల్ శుక్రవారం తెలిపారు. కొన్ని రోజులుగా ఆస్తి విషయంలో కొంతమంది యువకుల మధ్య తగాదా నెలకొంది. మండలంలోని కంఠం గ్రామానికి చెందిన సురేశ్ అలియాస్ జాదు, లక్కంపల్లి గ్రామానికి చెందిన మూడమహేందర్, రాజశేఖర్, నందిపేటకు చెందిన అక్బర్‌తో పాటు మరో ఇద్దరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

ఐదుగురి రిమాండ్

కామారెడ్డి క్రైం: కామారెడ్డి డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న ఓ దుకాణం ఎదురుగా 20 రోజుల క్రితం జరిగిన దాడి ఘటనలో తీవ్రంగా గాయపడిన చంద్రకాంత్ (25) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటనలో యువకుడి మృతికి కారణమైన నిందితులు సంకరి నరేందర్, మాడుగుల ప్రణీత్, సర్గన రాకేశ్, మామిళ్ళ మనోజ్ కుమార్‌తో పాటు మరో మైనర్ యువకుడిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

నీలాలో బంగారం చోరీ

రెంజల్: సర్వే కోసం అధికారులు వస్తున్నారని ఓ వృద్ధురాలిని నమ్మించి 12 గ్రాముల బంగారు నగలను ఓ యువకుడు అపహరించిన ఘటన మండలంలోని నీలా గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అంబం పోసాని ఇంటి ఎదుట నిలబడగా గుర్తు తెలియని యువకుడు బైక్‌పై వచ్చి తాను ప్రభుత్వ ఉద్యోగినని సర్వే కోసం అధికారులు వస్తున్నారని నమ్మించాడు. మెడలోని 12 బంగారాన్ని తీసి ఇంట్లో దాచుకోవాలని సూచించాడు. ఇది నమ్మిన వృద్ధురాలు నగలు తీసి ఇంట్లోకి వెళ్లగా ఆమె వెనుకాలే వెళ్లిన యువకుడు వాటిని దొంగిలించాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్, రెంజల్ ఎస్సై ఉదయ్‌కుమార్ వెంటనే సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి బాలుడి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

బాన్సువాడ: బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన సోము శ్రీనివాస్(16) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. పశువులను కాయడానికి గ్రామశివారులోని చెరువు వద్దకు వెళ్లిన శ్రీనివాస్ సరదాగా ఆవుతోక పట్టుకుని చెరువు దాటే ప్రయత్నం చేశాడు. చెరువు మధ్యలోకి వెళ్లిన తర్వాత ఆందోళనతో తోక వదిలేయడంతో నీటమునిగి ఊపిరాడక మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..



నర్సాగౌడ్ (ఫైల్)

మాచారెడ్డి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మండల కేంద్రానికి చెందిన మంతపురం నర్సాగౌడ్(32) శుక్రవారం మృతి చెందాడు. ఈ నెల 12న మండలంలోని భవానిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నర్సాగౌడ్‌ను కుటుంబీకులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

వీడీసీ సభ్యులపై కేసు నమోదు

డిచ్‌పల్లి: మండలంలోని రాంపూర్ వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌చార్జి సీఐ సైదా, ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. సీఐ, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ గ్రామానికి చెందిన ఎస్‌కే షేర్‌ఖాన్ తనను వీడీసీ సభ్యులు భయభ్రాంతులకు గురి చేసి ఇబ్బందులకు కలుగజేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు వీడీసీ చైర్మన్ రాజ్‌కుమార్, సభ్యులు లింగుల లింగన్న, బక్కయి రాజన్న, కర్రోల్ల సుమన్, తెడ్డు నరేశ్, పోతర్ల రవి, సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీడీసీ సభ్యులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. వీడీసీ సభ్యులు గ్రామస్తులకు భయభ్రాంతులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌చార్జి సీఐ హెచ్చరించారు.

అల్ప్రాజోలం పట్టివేత



కామారెడ్డి క్రైం: కల్తీ కల్లులో వినియోగించే మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న ఇద్దరిని నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకుజిల్లా కేంద్రానికి సమీపంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో ఇద్దరు బైక్‌లపై అల్ప్రాజోలం డ్రగ్‌ను సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. నిందితులైన కదిరె సాగర్‌గౌడ్, మేడుదుల సాగర్‌గౌడ్ నుంచి 900 గ్రాముల అల్ప్రాజోలం నార్కోటిక్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్ తెలిపారు. దీని విలువ దాదాపు రూ.5 లక్షలు ఉంటుందన్నారు. వీరి నుంచి 2 బైక్‌లు, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

మోపాల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక, సదరు యువకుడు రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను మోసం చేశాడు. బాలిక పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో యువకుడు మొహం చాటేశాడు. దీంతో బాలిక ఈనెల 13న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలులో మృతదేహం లభ్యం



నవీపేట/ఖలీల్‌వాడి: నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్ వెళ్తున్న రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ శుక్రవారం తెలిపారు. బాసర నుంచి రాజమండ్రి వెళ్తున్నట్లు మృతుని జేబులో టికెట్ లభ్యమైందని పేర్కొన్నారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్ల వరకు ఉంటుందని అన్నారు. మృతుడి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 9866167291, 9440604320ను సంప్రదించాలని కోరారు.